క్లుప్తంగా

యర్రం పిచ్చమ్మ మృతికి సంతాపం


పిచ్చమ్మకు నివాళులర్పిస్తున్న హనిమిరెడ్డి

పర్చూరు(చినగంజాం)/మేదరమెట్ల: రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ మృతి పట్ల పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, జెడ్పీవైస్ చైర్మన్ చుండి సుగుణమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు, నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్‌లు జంపని వీరయ్య, కఠారి అప్పారావు, మున్నం నాగేశ్వరరెడ్డి, రావూరి వేణుబాబు, జువ్వా శివరాం ప్రసాద్, చిన్ని పూర్ణారావు, పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, మల్లా శ్రీనివాసరావు, గాజుల రమేష్, కంచెనపల్లి శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, గోగుల పూర్ణ, కాల్వ అనిల్, గేరా స్వరాజ్ కుమార్, జంగా వంశీ, నాని, జూపూడి రోశయ్య, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు వైవీ సుబ్బారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పిచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల: వేర్వేరు ప్రమాదాలో ముగ్గురికి గాయాలయ్యాయి. మోటారు బైకు అదుపు తప్పి బోల్తాపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన మేదరమెట్ల తమ్మవరం రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. మణికేశ్వరం గ్రామానికి చెందిన ఇద్దరు ఒంగోలు వైపు నుంచి అద్దంకి వైపు బైకుపై వెళ్తున్నారు. బైకు మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలోగల ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి రాగానే బైకు అదుపు తప్పింది కిందపడింది. బైకుపై ఉన్న ఇద్దరికి గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

అద్దంకి (సంతమాగులూరు): సంతమాగులూరు మండలంలోని కామపల్లిలో స్కూటీ అదుపుతప్పి ఓవ్యక్తికి గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు ఏడుకొండలు అనే వ్యక్తి సోమవారం విజయవాడ నుంచి వినుకొండకు స్కూటీ మీద బయలుదేరాడు. ఈ క్రమంలో స్కూటీ కామేపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి కిందపడిపోయింది. ప్రమాదంతో ఏడుకొండలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంతో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

వ్యాధుల కాలం.. జీవాలు భద్రం


గేదె పాలు పితుకుతున్న మహిళ


వైద్యం కోసం ఉంచిన గేదెలు

- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి మురళీకృష్ణ

జే.పంగులూరు: ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మనుషులమైన మనమే అల్లాడిపోతున్నాం. ఇక మూగ జీవాల గురించి చెప్పనక్కర్లేదు. ఎండల ప్రభావంతో మూగజీవాలు ఇబ్బందులకు గురవుతాయి. ప్రస్తుత కాలంలో మూగజీవాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. పశువులు అనారోగ్య బారిన పడితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని పశువైద్యాధిరులు చెప్తున్నారు. వేసవిలో పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి మురళీకృష్ణ పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

ఎండ నుంచి రక్షణ..

పాడి పశువులను ఎండ ఎక్కువ ఉన్న సమయంలో మేతకు బయటకు వదలకుండా ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకెళ్లాలి. రోజులో మూడు లేదా నాలుగు సార్లు చల్లని నీటితో పశువులను కడగాలి. పశువుల పాకలో గాలి బాగా వచ్చే విధంగా చూడాలి. ఎత్తైన ప్రదేశాల్లో గడ్డిని కప్పి మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో నీటిని చల్లాలి. వడగాడ్పుల ప్రభావం లేకుండా పశువులకు గోనే పట్టలతో పరదాలు ఏర్పాటు చేయాలి. వీటిని కూడా మధ్యాహ్నం సమయంలో నీటితో తడపాలి. పశువుల కొట్టాలపై భాగంలో తెలుపు రంగు వేయాలి. పశువులను దూరం దూరంగా ఉంచాలి.

అధిక పాల దిగుబడికి సూచనలు..

నాటు జాతి పశువుల కంటే సంకర జాతి ఆవులు, గేదేలు, త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిని తరుచూ చల్లని నీటితో తడుపుతుండాలి. ఒక్కో పశువు రోజుకి 60 లీటర్ల నీరు తాగుతుంది. వేసవిలో ఆ పరిమాణం మరింత పెరుగుతుంది. ఈ కారణంగా జీవాలకు మరింత తాగునీరు అందుబాటులో ఉంచాలి. తగినంత పచ్చి మేత వేయాలి. అత్యధిక పోషక విలువలు కలిగిన దాణాను అందించాలి. దాణాలో మినరల్ మిక్చర్ కలిపి ఇవ్వడంతో పాటు తగినంత ఉప్పు శాతం ఉండేలా చూసుకోవాలి. ఉదయం సాయంత్రం పాలు తీసే అరగంట ముందు పశువులను చల్లని నీళ్లతో కడిగితే పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

గొర్రెలు, మేకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వేసవిలో గొర్రెలు, మేకల కాపర్లు కూడా వాటి సంరక్షణ కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలి. బయట పచ్చి బయళ్లలో ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మేపుతూ మధ్యాహ్నం నీడలో విశ్రాంతి కల్పించాలి. చూడితో ఉన్న వాటిని ఇంటి వద్దే ఉంచి ఆహారం అందించాలి. మేక, గొర్రె పిల్లలతో సహా అన్నింటికీ నల్లల నివారణ మందులను వేయాలి.

నియోజకవర్గంలో ఉన్న జీవాలు..

మండలం	గేదెలు	ఆవులు	మేకలు
జే.పంగులూరు	5210	1200	38803
బల్లికురవ	7348	2300	41780
సంతమాగులూరు	7523	1800	39212
అద్దంకి	6230	1504	37415
కొరిశపాడు	5700	1100	34870

జాగ్రతలు తప్పనిసరి..



వేసవిలో మూగజీవుల పెంపకంపై జాగ్రతలు పాటిస్తే వ్యాధులు నుంచి దూరంగా ఉండొచ్చు. నట్టల నివారణ మందులు ప్రతి పశువుకు వేయించేలా చర్యలు తీసుకోవాలి. వేసవి వ్యాధులు సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మందులు వేయించుకోవాలి. ఎటువంటి సూచనలు కావాలన్నా వైద్యులను సంప్రదించాలి.

– మురళీకృష్ణ, మండల పశువైద్యాధికారి,

ఘనంగా రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతక స్వామి ఆలయంలో ఘనంగా రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ చేశారు. తూర్పువైపున నిర్మించిన రాజగోపురం పంచవిమాన శిఖరంల ప్రతిష్టాసహిత మహాకుంభాభిషేక మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దాత రాటకొండ హనుమంతురావు, ధర్మపత్ని రాధిక గార్లచే రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ రాజగోపురానికి గత మూడురోజులుగా మూలమంత్ర హోమాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పుణ్య నదిజలాలతో కలశాలకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు, దాన్యాధివాసం, జలాదివాసం, త్రిశూల మండపారాధన, పుష్పాధివాసం, ప్రాణ ప్రతిష్ట, యంత్ర స్థాపన, రాజగోపురం మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించారు. ఈ కలశాలను శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. చివరిరోజున రాజగోపురాలకు పంచలోహలతో తయారుచేసిన కలశాలను రాజగోపురంపై ప్రతిష్ఠించారు. కార్యక్రమాలు అర్చకులు మూలం రాజ్ రాజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో యాజ్ఞికులు పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు.


కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాతలు

15 ఎకరాల గడ్డివామి దగ్ధం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గేదెల మేత కోసం ఉంచిన వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈఘటన సంతమాగులూరు మండలంలోని తంగేడుమల్లి గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత రైతుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతులు సరేమల్ల భాస్కరరావు, సరేమల్ల నాగేశ్ గేదెల మేత కోసం ఇంటివద్దే సుమారు 15 ఎకరాల గడ్డివామును భద్రపరిచారు. సోమవారం ప్రమాదవశాత్తు వాములకు నిప్పంటుకుని అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఈ-క్రాప్ జాబితా పరిశీలించుకోవాలి

బల్లికురవ: మండలంలోని 20 రైతు సేవాకేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదుకు ముసాయిదా జాబితాలను ప్రదర్శించామని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో సాగు చేసిన అన్ని పంటలకు సంభందించిన ఈ జాబితాలను రైతులు పరిశీలించుకుని తప్పులుంటే వెంటనే సరిచేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందేందుకు 11 అంకెల విశిష్ట నంబరు రిజిస్ట్రేషన్ తక్షణమే చేయించుకోవాలని కుమారి కోరారు.

సంక్షిప్తంగా

చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకి: చెత్త సేకరణ పరిశుభ్రతపై పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో సింగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సెక్రటరీలతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణతో చెత్త నుంచి కంపోస్టు తయారీ చేయాలని చెప్పారు. అదే విధంగా గ్రామ పంచాయతీల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న ఎరువు దిబ్బలను తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇంటిపన్నుల వసూలు చేయాలి..

చీరాల టౌన్: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి ఆదేశాలతో కార్యదర్శులు ఇంటిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వసూళ్లలో అలసత్వం వలన పలు సమస్యలు వేధిస్తున్నాయన్నారు. మార్చి 31 తేదీలోపు పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు మౌనికా రెడ్డి



పతకం అందుకున్న మౌనికా రెడ్డి

చినగంజాం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు చినగంజాంకు చెందిన ఆట్ల మౌనికారెడ్డి ఎంపికయ్యారు. 16 వతేదీ ఆదివారం తెనాలి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. పోటీలలో 10 జిల్లాల నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల నుంచి 20 క్రీడాకారులు పాల్గొని 11 పథకాలు సాధించగా వారిలో 58 కిలోల కేటగిరిలో చినగంజాంకు చెందిన ఆట్ల మౌనికా రెడ్డి సిల్వర్ మెడల్ సాధించారు. దాంతో ఆమెను నిర్వాహకులు ఆట్ల మౌనికారెడ్డి నైపుణ్యం కనబరచడంతో ఆమెను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఆమెను ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన తైక్వాండో హెడ్ సలాం, చినగంజాంకు చెందిన తైక్వాండో కోచ్ సుల్తాన్‌లు ఆమెకు అభినందనలు తెలిపారు. తమ కుమార్తె జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల తైక్వాండో హెడ్‌సలాంకు మౌనికా రెడ్డి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండపై వేంచేసిఉన్న లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థాన కార్య నిర్వాహణాధికారిగా మద్దినేని శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి కృషిచెస్తానన్నారు. కార్యక్రమంలో ఈవో కోటిరెడ్డి, దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జే.పంగులూరు: పంగులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంగులూరు గ్రామానికి మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంగులూరు గ్రామం నుంచి విద్యుత్ కొత్త లైన్లు వేస్తున్నందువల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాల అభివృద్ధిలో శ్రద్ధ అవసరం


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపి విద్యార్థుల సంఖ్య పెంచాలని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగాని వారిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి పరిశీలించారు. ముందుగా తరగతి గదిలోని విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని వసతి సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, భోజనంలో గుడ్డు పంపిణీ, చిక్కిలు తదితర అంశాలపై వారని ఆరా తీశారు. అనంతరం యూనిఫాం, కిట్‌ల పంపిణీ, విద్యార్థుల రోల్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది రోల్ 72 మంది కాగా ఈ ఏడాది 36కు తగ్గిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు

జే.పంగులూరు: రైతులు పండించిన నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించాలని మండల రైతు సంఘం, కౌలు రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంగులూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, తహసీల్దార్‌కు సింగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ రంగారావు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నల్ల బర్లీ పొగాకును కొనుగోలు కోసం వెంటనే ప్రభుత్వం కంపెనీని పిలిచి, వారితో మాట్లాడి కొనుగోలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతేడాది కొన్న ధరకే ఈ సంవత్సరం కొనుగోలు చేయాలన్నారు. గత సంవత్సరం ఆయా పొగాకు కంపెనీలకు మంచి లాభాలు వచ్చాయని, అందుకే కంపెనీలు వారి స్వలాభం కోసం రైతులతో పొగాకు పండించారని అన్నారు. ఇప్పుడు పొగాకు కొనుగోలు చేయకుండా కంపెనీలు ముఖం చాటేశాయన్నారు. గ్రామాల్లో బర్లీ పొగాకు రైతుల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు గుడిపాటి మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు, పోతుగంటి అందుసాహెబ్, పాలపర్తి తిరుపతయ్య, నాయపాము ప్రభాకర్, ఇంటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


వలపర్లలో హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు


స్వర్ణ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల, తల్లిదండ్రుల హడావుడి


అద్దంకి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

- పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడి
- అన్నీ ఏర్పాట్లు చేసిన అధికారులు

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/ఇంకొల్లు (చినగంజాం)/కారంచేడు: విద్యార్థులకు తొలిమెట్టు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం నుంచే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు హడావుడి చేశారు. చినగంజాం మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. రెండు పరీక్ష కేంద్రాలు చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించగా మొత్తం 417 మంది పరీక్ష రాయాల్సి ఉంది. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 259 మందికి గాను 257 మంది మాత్రమే పరీక్షకు హాజరు కాగా ఇద్దరు పరీక్షకు గైర్హాజరయ్యారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 158 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. చినగంజాం చీఫ్‌గా డీ హేమంత్ కుమార్, డీవోగా వై రత్నం, కడవకుదురు చీఫ్‌గా ఏవీ సుబ్బారావు, డీఓగా డీ మరియన్‌బాబులు వ్యవహరించినట్లు ఎంఈఓ బీ అజయ్‌బాబు తెలిపారు.

■ ఇంకొల్లు మండలంలో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలలో మొత్తం 785 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇంకొల్లు, పావులూరు, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పూసపాడు ఎస్‌కేపీవీఎస్ హైస్కూల్, ఇంకొల్లు ఎన్ఆర్‌వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్, ఆదర్శ హైస్కూల్, గౌతమి హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8 మంది గైర్హాజరయ్యారు.

■ పర్చూరు మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వాహణ కోసం మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 672 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వైఆర్ హైస్కూల్‌లో 188 మందికి గాను 186 మంది, బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీలో 163 మందికి గాను 159 , నాగులపాలెం ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 268 మందికిగాను 265, అన్నంబొట్లవారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 53 మందికి గాను 46 మంది పరీక్షకు హాజరయ్యారు. పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా పరీక్షా కేంద్రంలోని అన్ని గదులను తనిఖీ చేశారు.

■ కారంచేడు మండలంలో మండలంలోని కుంకలమర్రు, యర్రంవారిపాలెం, కొడవలివారిపాలెం, స్వర్ణ ఉన్నత పాఠశాలల పరిధిలో మొత్తం 111 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. అయితే వీరిలో ముగ్గురు గైర్హాజరు కాగా 108 మంది తెలుగు పరీక్షను రాసినట్లు ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా యద్దనపూడి ఎంఈఓ-2 గోపి తనిఖీలు చేశారు. ఎగ్జామ్ చీఫ్‌గా భాస్కరరావులు బాధ్యతలు నిర్వహించారు. కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు నిర్వహించారు.

■ యద్దనపూడి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఉండగా పూనూరు పరీక్షా కేంద్రంలో గన్నవరం, పూనూరు, అనంతవరం, జాగర్లమూడి పాఠశాలకు చెందిన విద్యార్థులు 148 మంది గాను 147 మంది పరీక్షకు హాజరయ్యారు. యద్దనపూడిలో 127మందికి 124 మంది పరీక్షకు హాజరయ్యారు. పూనూరు ఎక్జామ్ సెంటర్ చీఫ్ సూపరిడెంటెంట్ ఎమ్. దేవేంద్రరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ తుర్లపాటి శ్రీనివాసరావు, యద్దనపూడి చీఫ్ సూపరెండెంట్ జంగా పోతురాజు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ తేళ్ల రమేష్‌చంద్ర విధులు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై రత్నకుమారి 144 సెక్షన్ అమలుపరిచారు.

■ మార్టూరు మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 957 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో వస్త్రాం నాయక్ తెలిపారు. మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయల్, చైతన్య హైస్కూల్, ద్రోణాదుల, వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు..

అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: పది పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు తెలుగు పరీక్షకు నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు. మండలంలో రావినూతల జెడ్పీహెచ్ఎస్, మేదరమెట్ల, సెయింట్ ఆర్నాల్డ్స్‌లో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 459 మంది విద్యార్థుల్లో 455 మంది పరీక్ష రాశారు.

■ బల్లికురవ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో-2 కే. రమేష్‌బాబు తెలిపారు. బల్లికురవలో 146 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 145 మంది, పెదఅంబడిపూడిలో 96 మందికి గాను 95 మంది, వైదన పరీక్ష కేంద్రంలో 246 మందికి గాను 245 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు.

■ అద్దంకి మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు తల్లిదండ్రులతో విద్యార్థులు హజరైయ్యారు. పరీక్షలను ఎంఈవోబీ. సుధాకరరావు పర్యవేక్షించారు. అనతరం సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

■ జే.పంగులూరు మండలంలో తెలుగు పరీక్షలో ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యాడని ఎంఈవో వీరాంజేయులు తెలిపారు. పంగులూరు జెడ్పీహెచ్ఎస్‌లో చందలూరు, అలవలపాడు పాఠశాలల నుంచి 216 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఒకరు మాత్రమే గైర్హాజరయ్యాడు. ముప్పవరంలోని పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ హైస్కూల్లో కొండమంజులూరు, ముప్పవరం హైస్కూల్ విద్యార్థులు 120 మందికి 120 మంది పరీక్షలు రాశారని తెలిపారు. బూదవాడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఇంకొల్లు మండలం పావులూరు హైస్కూల్లో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.

చీరాలలో 18 మంది గైర్హాజరు..

చీరాల/వేటపాలెం: పదో తరగతి ఆఖరి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పది పరీక్షలకు చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 1650 మంది విద్యార్థులకుగాను 1632 మంది హాజరుకాగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పది పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. వేటపాలెం మండలంలో 5 పరీక్ష కేంద్రాల్లో 1063కు గాను 1043 మంది పరీక్ష రాశారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


తహశీల్దార్ గోపికృష్ణకు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అద్దంకి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ అద్దంకి సంఘ నాయకులు సోమవారం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాల్సిన ప్పటికీ ఇప్పటి వరకూ ఏర్పాటు కాని పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తెసుకెళ్లడమే తమ ఉద్దేశమని చెప్పారు. అదే విధంగా పింఛనర్లకు అందజేయాల్సిన డిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను 70 సంవత్సరాలు నిండిన వారికి ఏడు నుంచి పది శాతం 75 ఏళ్లు నిండిన వారికి 12 నుంచి 15 శాతం ఇచ్చే విధాన్ని తిరి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అద్దంకి అధ్యక్షుడు షేక్ మస్తాన్, ప్రధాన కార్యదర్శి తేలప్రోలు కృష్ణయ్య, కోశాధికారి మారం కోటేశ్వరరావు, సహాయ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి ఉన్నారు.

మార్టూరు: 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మార్టూరు తాలూకా శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది . స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

అనంతరం తహసీల్దార్ టీ.ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కమాలుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. చిట్టిబాబు, కోశాధికారి లక్ష్మయ్య, శివరామ కోటేశ్వరరావు, రాజేంద్రబాబు, ఎం.అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

చీరాల టౌన్: 35 ఏళ్లపాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులుతమ సమస్యలపై తహశీల్దార్ గోపీకృష్ణకు అర్జీ అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మారెడ్డి, జి.శివప్రసాదరావు, ఏకాంబరేశ్వర బాబులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ఆ హామీని అమలు చేయడం లేదన్నారు. అలానే పలువురు తమ సమస్యలపై పలు అర్జీలను తహశీల్దార్‌కు అందించారు.